
# మహానగరం కథలు
## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# 'లెట్ గో!'

"హీరా రిజైన్ చేసింది, ప్లీజ్! నువ్వు ఒకసారి మాట్లాడగలవా?" నా ఎదురుగా కూర్చున్న ప్రమోద్ అడిగాడు.

అతన్ని పరిశీలనగా చూశానో క్షణం పాటు..

ఎప్పుడూ మడత నలగని బట్టల్లో, చిరునవ్వుతో ఉండే అతను ఈరోజు చిరాగ్గా, అసహనంగా ఉన్నాడు.

కాలర్ దగ్గర నలిగిన లేత రంగు కుర్తా, అసలే లోపలకి ఉండే కళ్ళు మరింత లోపలకి పోయి పీక్కుపోయినట్టున్న ముఖమూ, చాలా కలత పడినట్టుగా ఉన్నాడు.

"ప్రమోద్? ఏమయింది? ఈజ్ ఎవెరీథింగ్ ఓకే?" అన్నాను ఆత్రుతగా..

' యా, ఐ యాం!' హీరాని అడుగు! తన రాజీనామాని వెనక్కు తీసుకోమను. ప్లీజ్' అన్నాడు నెమ్మదిగా..

"మనది చిన్న సంస్థ. రాజీవ్, నువ్వు, నా భర్త అనిల్, నేనూ కలిసి పెట్టుకున్నది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న మనకి ప్రతీ ఉద్యోగి ముఖ్యమే, అసలే సంస్థకైనా అది నిజం. హెచ్.ఆర్ చూసుకునే నాకు అది మరింత ముఖ్యం. ప్రతి ఒక్కరినీ శ్రద్ధగా చూసుకోవడం నా బాధ్యత, ఉద్యోగులు మనతో ఉన్నప్పుడు, వదిలి వెళ్ళేటప్పుడూ కూడా. అది నీకూ తెలుసు!" అంటున్న నన్ను మధ్యలోనే ఆపి..

"కానీ హీరా?" అంటూ ఆగాడు.

"ఊ, హీరా? ఆవిడేమైనా స్పెషలా? " అన్నాను చేతిలో పెన్సిల్ అటూ ఇటూ తిప్పుతూ.

"హ్మ్మ.. తను వేరు!!" అన్నాడు నెమ్మదిగా నీళ్ళు నములుతున్నట్టు.

"అదే ఎలా?"

నేను ఎత్తిపొడుస్తున్నాననుకున్నాడు.

అందుకే దెబ్బ తిన్నట్టుగా..

"మాధవీ, ప్లీజ్ ఇంకా సాగదియ్యకు, నన్ను ఇంకా గిల్టీగా ఫీల్ అయ్యేలా చెయ్యకు, ప్లీజ్ డూ సంథింగ్.. స్టాప్ హర్ ఫ్రమ్ లీవింగ్ ద ఫర్మ్.." అన్నాడు..

నీళ్ళు లేవు కానీ తడి కన్నులతో నా ఎదురుగా కూర్చున్న ఆ నలభై ఐదేళ్ళ బ్రహ్మచారిని సహానుభూతిగా చూశాను.

ఎంపథీ..

"ఎందుకు? ఏమయింది? ఆవిడ రిజైన్ చేస్తే నువ్వెందుకింత ఫీల్ అవుతున్నావు? మనవేమీ గవర్నమెంట్ ఉద్యోగాలు కావు, ఇలాంటి ఏ సంస్థకైనా ఉద్యోగులు రావడం, పోవడం మామూలే కదా. దానికింత ప్రయాస పడాలా? హీరా కి ఇంకెక్కడో జాబ్ దొరికి ఉంటుంది. ఇంకా మంచి హోదా, మంచి జీతం.. లేదా తన ఊరికి దగ్గర.. కావలసిన విధులు.. ఎన్నో కారణాలు.." అన్నాను అనునయిస్తున్నట్టుగా..

"కాదు, నాకు తెలుసు! తను నా మూలంగానే వదిలి వెళ్తోంది.. లేకపోతే వెళ్ళదు, నాతోనే ఎన్నోసార్లు చెప్పింది మన కంపెనీ అంటే తనకెంత ఇష్టమో."

" వాట్! నీవల్లా?ఎందుకలా అనుకుంటున్నావ్? కొంచం వివరంగా మాట్లాడదామా? ఇప్పుడైనా సరే, లంచ్ టైములోనైనా సరే" అన్నాను..

" యా, ఐ థింక్ ఐ నీడ్ టు టాక్ నౌ. నీకు టైముంటే" అన్నాడు..

" ష్యూర్", అన్నాను.

' డోంట్ డిస్టర్బ్' అన్న 'పోస్ట్ ఇట్' స్లిప్ ని బయట అంటిస్తూ నా కేబిన్ తలుపు మూసాను.

వచ్చి మళ్ళీ అతని ఎదురుగా కూర్చుంటూ అన్నాను

" చెప్పు ప్రమోద్, వాట్ ఈజ్ ఇట్?"

ఇన్నేళ్ళ మా పరిచయం లో ఎప్పుడూ అలా చూడలేదతన్ని. ఎంతో తెలివైన వాడు, మృదుస్వభావి, సౌమ్యంగా సరళంగా మాట్లాడతాడు, సున్నితంగా ఆలోచిస్తాడు. కాకపోతే చాలా ఎమోషనల్.

అనిల్, నేను ప్రమోద్ ఎం.బియే లో క్లాస్మేట్స్ మి.. మా స్నేహం, పరిచయం ఈనాటివి కాదు.

మా పెళ్ళిజరిగి పదిహేడేళ్ళవుతోంది, ఇన్నేళ్ళలో మా స్నేహం మరింత బలపడిందే కానీ చెక్కు చెదరలేదు.

వ్యక్తిగత కారణాలవల్ల ప్రమోద్ పెళ్ళి చేసుకోలేదు, తల్లి తండ్రులతో కలిసి ఉంటాడు. మా అమ్మాయి లిపి ని తన స్వంత కూతురికంటే ఎక్కువ ప్రేమిస్తాడు, ఆనందంగా బేబీ సిట్టింగ్ చేస్తాడు ఈరోజుకీ. ఇలా ఎన్నో రకాలుగా మా కుటుంబ సభ్యుడు తను..

అందుకేనేమో అతన్నిలా చూస్తూ ఉంటే బాధగా ఉంది నాకు.

హీరాని ఆమె క్లాస్ మేట్స్ మరో నలుగురిని కాంపస్ లో ఇంటర్వ్యూలు జరిపి మా సంస్థలోకి తీసుకున్నాం దాదాపు సంవత్సరం క్రితం..

ఇరవై రెండేళ్ళ హీరా ఎంతో సరదాగా, కలుపుగోలుగా ఉండేది. అందం కన్నా, ఆకర్షణ, చురుకుదనం ఎక్కువ ఆ అమ్మాయిలో. చెప్పినవన్నీ త్వరగా అర్థం చేసుకుని, వెంటనే పని చేసేది. అందరినీ నవ్వుతూ పలకరించేది. వస్త్రధారణ, ఆలోచనలు అన్నింటిలోనూ ఆధునికత ఉన్న ఈకాలపు అమ్మాయి. మిగిలిన నలుగురూ అబ్బాయిలు కావడంతో సహజంగానే ఆమెని ప్రత్యేకంగా చూసేవారు. నలభై మంది దాకా ఉన్న మా కంపెనీలో ఆడపిల్లలు ఓ పదిమంది దాకా ఉంటారు. చిన్న సంస్థ కావడాన అందరూ అందరికీ తెలుసు చాలావరకూ.

" కొత్తవాళ్ళతో నేను పని చేస్తాను" అన్నాడు ప్రమోద్ ఎప్పటిలాగే. అతని సమర్ధతా, శిక్షణా నైపుణ్యం మాకు తెలుసు. చిన్నవారితో చిన్నవాడిలా, అనుభవం ఉన్నవారితో వారికి తగ్గట్టుగా ప్రవర్తిస్తాడు, అలా మొదలయింది మొదట ట్రెయినింగ్, తర్వాత ప్రాజెక్ట్ పని.

అన్నీ సజావుగానే నడుస్తున్నాయి, ఇంతలో ఏమయింది? అనుకున్నాను

"చెప్పు ప్రమోద్! ఏమిటి హీరాతో నీ సమస్య?" అన్నాను మళ్ళీ.

చెప్పడం మొదలు పెట్టాడు.. దాదాపు పదిహేడు నిమిషాలు ఆపకుండా...

★★

" మొదట్లో నేనెవ్వరినీ ప్రత్యేకంగా చూడలేదు మాధవీ, నీకూ తెలుసుగా! కానీ ఎక్కడో, ఎప్పుడో హీరాతో కనెక్ట్ అవడం మొదలైంది. బహుశా నాకు తెలియకుండానే. ఆమె ఏం చేసినా ప్రత్యేకంగా అనిపించసాగింది. ' ఓ కాగజ్ కి కష్టీ' అంటూ ఆ అమ్మాయి హమ్ చేస్తూ, పని చేసుకుంటుంటే నాకెంతో ముచ్చటగా అనిపించడం

" ప్రమోద్, ఇది చెప్పండి, అది తెలీలేదు" అని నన్ను పదే పదే తన సందేహాలతో పలకరించడం"

" మీరు కిందటి సారి అలా చెప్పారు, ఇప్పుడు మరోలా అంటున్నారు, ఏది కరక్ట్?" అంటూ నన్ను ప్రశ్నించడం

' ఇలా కాదు, అలా చేద్దాం' అని నన్ను దబాయించడం

" ఈ రోజు మీ పుట్టినరోజని మేము ఇలా సర్ప్రైజ్ చేద్దామని ప్లాన్ చేశాం" అని అర్ధరాత్రి వాళ్ళందరూ మా ఇంటికి వచ్చి కేక్ కోయించడం ఇలా ఎన్నో నాకు ఆ అమ్మాయిని దగ్గర చేశాయి మాధవీ..

"కానీ అదంతా ఏమీ లేదని, తను అందరితో ఉన్నట్టే నాతోనూ ఉందని తెలిసేసరికి తట్టుకోలేకపోయాను. తనంటే నాకిష్టం ఉన్నట్టే నేనంటే తనకీ అనుకున్నాను. కరక్ట్! అదే నే చేసిన తప్పు అయినా నన్ను ఆ అమ్మాయి రిజెక్ట్ చేసిందని ఒప్పుకోలేకపోతున్నాను. ".

ఆరోజు.. తన పుట్టినరోజు..

"ప్రమోద్, స్వీట్ తీసుకోండి, నా పుట్టినరోజు. మీరందరూ మా ఇంటికి వస్తారని రాత్రి ఎదురుచూశాను" అంది నవ్వుతూ..

" అరే, అవునా! సారీ.. మాకు తట్టలేదు" అన్నాను అపాలజిటిక్ గా.

"పరవాలేదు, నేను సరదాగా అన్నాను." అంది నవ్వుతూ.

నేను స్వీట్ తీసుకున్నాకా తను వెళ్ళిపోయింది.

ఆతర్వాత చెప్పాను.. "లంచ్ కి బయటకి వెళదాం!"అని..

" దట్స్ ఏ గుడ్ ఐడియా! పొద్దున్నించీ అందరి ఫోన్ కాల్స్ తో వంట చేసుకోలేదు" అంది చిన్నగా నవ్వుతూ..

మధ్యాహ్నం తన సీట్ దగ్గరకొచ్చి "వెళదామా!" అని నేను అడిగే సమయానికి పొద్దున్న ఉన్న హుషారు లేదామెలో..

"సరే, ప్రమోద్!" అంది నెమ్మదిగా..

" ఏమయింది పొద్దుటి హుషారు? ఐ విల్ టేక్ యూ టు ఏ నైస్ ప్లేస్" అన్నాను బయటకు నడుస్తూ..

" మనిద్దరమేనా? మిగతావాళ్ళు?" అంది కార్లో కూర్చుంటూ.

" పొద్దున్నే అనుకున్నం కదా, వాళ్ళకి చెప్పేంత టైం లేదు" అన్నాను ఏదో చెప్పాలి కనక, వాళ్ళెవరినీ పిలుద్దామని నేను అనుకోలేదు నిజానికి.

" ఓ కే, గుడ్" అంది ఏదో చిన్న రిలీఫ్ తన ముఖంలో. నాకు హాయిగా అనిపించింది..

మరో ఇరవై నిమిషాల్లో నా కెంతో ఇష్టమైన ఫైన్ డైన్ రెస్టారెంట్ లో కూర్చున్నాం.

"ఏమయింది హీరా? ఎందుకు డల్ గా ఉన్నావు? ఎప్పుడూ చూడలేదిలా?" అన్నాను సూప్ బౌల్ ని తనవైపు జరుపుతూ..

"నో, నథింగ్.. ఐ యాం ఫైన్" అంది భుజాలెగరేస్తూ..

" దాదాపు సంవత్సరకాలం మన పరిచయం. నువ్వేమిటో నాకు తెలుసు. దేర్ ఈజ్ సంథింగ్.. నీకిష్టం లేకపోతే చెప్పద్దు, హావ్ యువర్ సూప్' అన్నానునవ్వుతూ.

అలా కాదు.. చెప్తాను. మీ కన్నా నాకెవరు?

నా మనసు ఆనందంతో గెంతులేసింది.." మీ కన్నా నాకెవరు?" అనుకున్నాను మనసులోనే మళ్ళీ.. ఐ యాం ఏ ఫూల్, గ్రోన్ అప్ ఫూల్..

" అమ్మా, నాన్నా పెళ్ళి గురించి పదే పదే అడుగుతున్నారు. చాలా ప్రెజర్.. " అంది క్లుప్తంగా.

" అవునా? సహజమే కదా, వాళ్ళ అత్రుత వాళ్ళకి ఉంటుంది కదా!" అన్నాను

" యా, కానీ! నేను, నాకు.." స్పూన్ నిండా సూప్ ని సుతారంగా నోట్లోకి పెట్టుకుంటూ..

"యా, యా.. "అన్నాను నాకు తెలుసు అన్నట్టుగా..

అలా అని ఊరుకోలేదు.. స్టుపిడ్ లా.. "నువ్వంటే నాకెంతో ఇష్టం, నీకిష్టం అయితే.. నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను." అధాట్టుగా అనేశాను

నాందీ, ప్రస్తావనా ఏమీ లేకుండా నేనన్న మాటలకి, పిడుగు పడినట్టుగా చేతిలోని స్పూన్ ని సూప్ గిన్నెలోకి వదిలేసింది..

పెద్దవైన ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం, 'వాట్' అన్న మాట మాత్రం వచ్చిందామె నోట్లోంచి..

చెదిరిన సూప్ చుక్కలు టేబిల్ మీద. బొట్లు బొట్లుగా..

' యా, హీరా! , ఐ థింక్ ఐ యాం ఇన్ లవ్ విత్ యూ.. నువ్వంటే నాకెంతో ఇష్టం.. కెన్ ఐ ఆస్క్ యూ"

నా మాటలు పూర్తి కాలేదు..

పెద్దవైన ఆ కళ్ళల్లోంచి కన్నీటి బొట్లు.. 'యూ టూ బ్రూటస్!" అన్నట్లున్న చూపులు..

కంగారు పడిపోయాను.. ఏం చెయ్యాలో తెలీలేదు..

" హీరా! ఏమయింది? నేనేమైనా తప్పుగా మాట్లాడానా? ప్లీజ్ ఏడవద్దు, పబ్లిక్ ప్లేస్ లో ఏమిటి ఇలా? ఏదైనా ఉంటే మరెక్కడైనా మాట్లడదాం" అన్నాను.

నా కంగారు , మాటల తడబాటు నాకే స్పష్టంగా తెలుస్తోంది.

అరచేతుల్నిండా చెమటలు...జేబురుమాలుతో నుదురు, ముఖమూ తుడుచుకున్నాను..

వెక్కి వెక్కి ఏడవసాగింది హీరా.

పేపర్ నేప్కిన్ ఇచ్చాను హీరాకి. కళ్ళు తుడుచుకుని కొన్ని క్షణాల్లో సర్దుకుంది అదృష్టవశాత్తు.

“నేను.. రాహుల్ ని ప్రేమించాను. వారిస్థాయి మాకన్నా చాలా తక్కువని మా అమ్మానాన్నలకి అస్సలు ఇష్టం లేదు. మా కజిన్ ముకుల్ ని చేసుకుంటే బావుంటుందని వాళ్ళ అభిప్రాయం. నేను ఎంత చెప్పినా వాళ్ళు ఒప్పుకోవడం లేదు, వారిష్టం లేకుండా పెళ్ళి చేసుకోకూడదని మా కోరిక. రాహుల్ గుర్గావ్ లో ఉన్నాడు, సరి అయిన ఉద్యోగం దొరికితే ఇక్కడికి వచ్చేయ్యలని ప్రయత్నిస్తు. న్నాడురాహుల్ కి చదువు, అందం అన్నీ ఉన్నాయి ఆస్థి తప్ప. ముకుల్ కి అది కూడా ఉంది, వాళ్ళ అమ్మా, నాన్నలదగ్గర్నుంచి పదే, పదే వచ్చే సందేశాలు. ఏం చెప్పాలో తెలీక అమ్మా, నాన్నల అసహనం. వీటితోనే నేను గత ఆరునెలలుగా సతమతమవుతున్నాను.

అది చాలనట్టు, నా దురదృష్టం కొద్దీ ముకుల్ ఈ ఊర్లోనే ఉద్యోగం లో చేరాడు. వచ్చినప్పటినించీ ‘తరచూ కలుద్దాం, సినిమాకెళ్దాం, డిన్నర్ కి వెళదాం’ అంటూ అడుగుతూ ఉంటే అది ఇంకా ప్రెజర్ అనిపిస్తోంది నాకు.

రాహుల్ గురించి అతనికి చెప్పలేను, రాహుల్ గుర్గావ్ లో ఉండడం వల్ల ఫోన్ ల లో తప్ప అతని సపోర్ట్ లేకపోవడం.. వీటన్నింటిమధ్యా ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను.

ఎలా పరిష్కరించుకోవాలో తెలీని సమస్యలు ఇవి.

మాది చాలా చిన్న ఊరు రాజస్థాన్ లో. అక్కడి పద్ధతులు వేరు, మనుష్యులు వేరు. అలాంటి చోట పెరిగి, నివసిస్తున్న అమ్మానాన్నలెప్పుడు మారతారో, ఎప్పుడు ఒప్పుకుంటారో తెలీదు. ఆపైన ముకుల్ వాళ్ళు..

' వాళ్ళకేం చెప్పాలి? ఎన్నాళ్ళు? నిన్ను చదివించి తప్పు చేశాం, ఇంటికొచ్చెయ్యి, ఆ తర్వాత చూద్దాం' రెండు రోజులకొకసారి నాన్న అనే మాటలివి

" మన బంధువుల్లో పరువు తీయకు, చెప్పింది విను" అని అమ్మ మందలింపులు..

మొన్న ముకుల్ వాళ్ళమ్మ సుమిత్రా బువా కూడా ఫోన్ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో నేనుండి మీ లాంటి పెద్దవారిని సలహా అడుగుదామనుకుంటే..

అంటూ ఆపేసి తాన బేగ్ తీసుకుని వడి వడిగా నేను రియాక్ట్ అయి ఆపేలోపునే బయటకు నడిచి ఆటో ఎక్కి వెళ్ళిపోయింది.

నిశ్చేష్టుడినయిపోయినట్టుగా కూర్చుండిపోయాను. ఎంత సేపున్నానో నాకే తెలీదు. మీలాంటి పెద్దవారి? ఆ మాట గుర్తొస్తే నా అహం ఎంత దెబ్బ తిందో తెలుసా? పెద్దవాడినా? నేనన్నదానికి కనీసం కాదన్నా పర్వాలేదు, కానీ తను నన్నసలు ఖాతరు చెయ్యనట్టుగా అనిపించింది మాధవీ.. నన్నొక అమ్మాయి అలా అనగలదని నేనసలు అనుకోలేదు.. అది నాలో మొదటగా కలిగిన భావం..

ఆతర్వాత వచ్చింది అంతులేని పశ్చాత్తాపం, అపరాధ భావం.

" ఏం చేశాను నేను? ఎప్పుడూ లేనిది ఇలా ఎలా?” ఇవే ప్రశ్నలు నన్ను తొలిచెయ్యడం మొదలుపెట్టాయి..

" హీరా నాగురించేమనుకుంటోందో?" అన్న ఊహే నాకు భరించలేనిదిగా ఉంది మాధవీ.. అందుకే క్రిందటివారం రెండు రోజులు ఆఫీస్ కి రాలేదు నేను..

'నువ్వు కూడా ఇంతేనా?' అన్న ఆమె చూపు నన్ను తినేస్తోంది తెలుసా!..కళ్ళజోడు తీసి విసిరి కొట్టినట్టుగా టేబిల్ మీద పడేస్తూ అన్నాడు..

ఆ రెండు రోజులు హీరా కూడా రాలేదని తెలిసింది, ఆపైన రిజైన్ చేసినట్టు మెయిల్ పంపింది.

★★

అతను చెప్పింది విన్నాకా కొన్ని క్షణాలు మాట్లాడలేదు నేను...

ఆ తర్వాత అన్నాను " ఇది, ఇదంతా నిజమేనా?" అని

" యా, ఐ కాంట్ బిలీవ్ దిస్.. ఇలా అవుతుందనుకోలేదు నేను" అన్నాడు నెమ్మదిగా.

“మరి ఎలా అవుతుందనుకున్నావు?” సూటిగా అడిగాను..

మాట్లాడలేదు ప్రమోద్.

నాకు తెలుసు అతన్ని హర్ట్ చేస్తున్నానని.. కానీ తప్పలేదు..

" ఇన్నాళ్ళకి నా మనసుకి దగ్గరగా వచ్చిందో అమ్మాయి, కానీ కాదంది..అది నాకెంత బాధగా ఉంటుందో నువ్వూహించగలవు కదా. " అన్నాడు..

" ఎందుకిలా జరిగింది? నన్ను చూసి పదే పదే అడిగితే నా బాధ పంచుకోవడానికి అమ్మతో చేప్పాను. ఇది విన్న అమ్మేమందో తెలుసా? 'నా బిడ్డ రత్నం, నీలాంటివాడిని వద్దనే అమ్మాయిలు కూడా ఉంటారా? 'అని. "

చిన్నపిల్లాడిలా చెప్తున్న మా కంపెనీ ఫౌండర్ డైరెక్టర్ ని చూస్తుంటే జాలితో పాటు నవ్వు కూడా వచ్చింది.

'ప్రతీ తల్లి తన బిడ్డ గురించి అలాగే అనుకుంటుంది, ఇక్కడ నీ వివేకం ఏమయింది? అని ప్రశ్నించాలనిపించింది.

"ఆవిడ సంగతి సరే, నువ్వెలా?" అన్నాను.

"చూడు ప్రమోద్, రియాలిటీ చెక్ చేద్దాం ఒకసారి. మీ అన్నయ్యకి ఓ కూతురుంది ఇంచుమించుగా హీరా వయసుదే.. ఆ అమ్మాయికి ఇలాగే జరిగి ఓ నలభై ఏళ్ళ వయసున్న బ్రహ్మచారికి ఓకే చెప్తే నువ్వేమంటావ్? ఆనందంగా ఒప్పుకుంటావా?" చాలా సూటిగా అడిగాను. అడక్కుండా ఉండవలసింది అనుకుంటూనే..

దెబ్బతిన్నట్టుగా చూశాడు. " మాధవీ!" అన్నాడు బాధగా.

"యా.. మాధవినే.. నువ్వు చెప్పింది విన్నాను, నాకుబాధ వేసింది కానీ నిజం నిష్టూరంగా ఉంటుంది కదా, ఆ అమ్మాయి అందరితోనూ ఉన్నట్టే నీతోనూ ఉంది, నీలో ఒక గైడ్ ని, టీచర్ ని చూసింది. అంతే కానీ మరేమీ లేదు. నిజమేనేమో, నాకు ఒప్పుకోవడానికి టైం ఇంకా టైం పడుతుందేమో, అదొకటి అనుకుంటేతను అప్పటికే రెండు సమస్యలతో సతమతమవుతుంటే నేను మూడో సమస్యనయ్యానా? అన్న గిల్టీ ఫీలింగ్ నన్ను తినేస్తోంది.. "

అన్నాడు.

జాలిగా చూశానతన్ని.

" ఓకే. రెండూ విడిగా చూద్దాం.

కారణాలేమైనా నువ్వా అమ్మాయిని ఇష్టపడ్డావు, అది తనకి చెప్పావు. అది తప్పు కాదు, చెప్పిన టైము సరి కాదు అంతే. ఆ అమ్మాయికున్న కారణాలవల్ల అది తను ఒప్పుకోలేకపోయింది. అది కూడా సరి అయినదే గా. ఇంక అక్కడితో వదిలేసి మామూలుగా ఉంటే సరిపోతుంది కదా.

ఇంక రెండోది, ఆ అమ్మాయి నీ గురించి ఏమనుకుంటోంది? అన్నది. దానిమీద నీకే కాదు ఎవరికీ కంట్రోల్ ఉండదు. ఆవిడ ఏమనుకున్నా జరిగినదాన్ని ఎవరూ మార్చలేరు కదా.

ఆ అమ్మాయిని ఉద్యోగం వదలకుండా మన కంపెనీలోనె ఉండేలా చెయ్యడం పరిహారం అని నువ్వు అనుకోవడం అనవసరం.

నిన్ననే నాతో మాట్లాడింది హీరా.

ఈ పరిస్థితి ఎలా వచ్చిందో తనకి తెలీదని, ఇంత జరిగాకా ఇక్కడే ఉండి అందరినీ బాధపెట్టడం మంచిది కాదని, అందుకే వెళ్ళిపోతానని చెప్పింది. నిన్నిలా చూస్తుంటే అదే మంచిదనిపిస్తోంది..

జీవితంలో లెట్ గో అనేది చాలా ముఖ్యం.. మనది కాని దేన్నైనా పట్టుకుని వేళ్ళాడడం వల్ల ప్రయోజనం ఉండదు.. మనుషులైనా, సంఘటనలైనా.. కొంత టైం పడుతుంది నీకు, కానీ అసంభవం కాఉ. ప్లీజ్ లెట్ గో, లెట్ హర్ గో. " అన్నాను అనునయంగా..

.

Click here to share your comments on this story